

శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,40,221లు, బంగారం 700 మిల్లీగ్రాములు, వెండి 5.3గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



పోలీసులపై బాంబు దాడి

-IIలో▸



చూడచక్కగా..

-IIలో▸

న్యూస్‌రీల్

1680 కిలోల గంజాయి ధ్వంసం



పర్యవేక్షిస్తున్న ఎస్పీ జగ్‌మోహన్ మినా, ఐఐసీ అధికారులు

బరంపురం: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నిందితుల నుంచి పట్టుబడిన గంజాయిని ఒడిశా హైకోర్టు ఆదేశాల మేరకు పోలీసులు సరగడాలో ధ్వంసం చేశారు. గంజాం ఎస్పీ జగ్‌మోహన్ మినా పర్యవేక్షణలో గురువారం నిప్పంటించారు. జిల్లా పరిధిలోని అస్కా, సెరగడ, పట్టపూర్ పోలీసు స్టేషన్ల పరిధిలో గత కొద్ది రోజులుగా గంజాయి మాఫియా నుంచి సీజ్ చేసిన 1680కిలోల గంజాయికి నిప్పంటించి, ధ్వంసం చేశారు. కార్యక్రమంలో అస్కా పోలీసు స్టేషన్ ఐఐసీ అధికారి ప్రశాంత్‌కుమార్ సాహు, సెరగడ ఐఐసీ మనోజ్‌కుమార్ సాహు, పట్టపూర్ ఐఐసీ సబ్యసాచి మల్లి, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కుసుమ్ టెట్టేకు ఊరట

- ఎమ్మెల్యే పదవి రద్దు పిటీషన్‌ను కొట్టివేసిన హైకోర్టు



ఎమ్మెల్యే కుసుమ్ టెట్టే

భువనేశ్వర్: సుందర్‌గఢ్ ఎమ్మెల్యే కుసుమ్ టెట్టేకు న్యాయస్థానంలో ఊరట కలిగింది. రాష్ట్ర హైకోర్టు గురువారం వెల్లడించిన తీర్పుతో ఆమెకు ఉపశమనం లభించింది. టెట్టే ఎమ్మెల్యే పదవి రద్దుకు సంబంధించిన అప్పీల్‌ను న్యాయస్థానం కొట్టి వేసింది. ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్ చట్టం ఉల్లంఘన అభియోగంతో ఆమెకు వ్యతిరేకంగా హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే పదవి రద్దు చేయాలని పిటిషనర్ న్యాయస్థానాన్ని అభ్యర్థించాడు. స్థానిక ఓటరు జగదీప్ ప్రతాప్‌దేవ్ ఈ కేసు దాఖలు చేశారు. ఈ మేరకు జస్టిస్ బిశ్వనాథ్ రథ్ ధర్మాసనం ఈ కేసు విచారణ జరిపింది. అయితే ప్రతివాదిని ఇబ్బంది పెట్టే లక్ష్యంతో ఈ పిటిషన్ దాఖలు చేసినట్లు హైకోర్టు అభిప్రాయం వ్యక్తంచేసింది. ఉద్దేశపూర్వకంగా ఇబ్బంది పెట్టేందుకు పిటిషన్ దాఖలు చేసినందున ప్రతివాదికి ఖర్చుల నిమిత్తం రూ.15 వేలు చెల్లించాలని జగదీప్‌ను ఆదేశించింది. రెండు వారాల్లోగా ఈ మొత్తాన్ని చెల్లించాలని వెల్లడించిన తీర్పులో స్పష్టం చేసింది.

గజపతి జిల్లాలో వర్షం

పర్లాకిమిడి: జిల్లాలోని కాశీనగర్ సమితి, పర్లాకిమిడి, గుమ్మా ప్రాంతాలలో గురువారం సాయంత్రం తేలికపాటి వర్షం కురిసింది. పలు గ్రామాల్లో ఉరుములతో కూడిన వర్షం నమోదైంది. దీంతో వాతావరణం చల్లబడింది. దాదాపు 4నెలల అనంతరం జిల్లాలో వాన కురవడంతో స్థానికులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నువ్వు పంటకు ఈ వర్షం ఉపయోగపడుతుందని జిల్లా వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో వైద్య సేవలు మెరుగుపరచండి




షాలినీ పండిట్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యేలు, దాస్

రాయగడ: జిల్లాలో వైద్య సౌకర్యాలను మెరుగు పరచడంతో పాటు ఖాళీగా ఉన్న డాక్టర్ల పోస్టులను భర్తీ చేయాలని రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి, గుణుపూర్ ఎమ్మెల్యే రఘునాథ్ గమాంగో, జిల్లా స్వాస్థ్య సమితి ముఖ్య సలహాదరుడు సుదీర్‌కుమార్ దాస్ కోరారు. ఈ మేరకు రాష్ట్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి శాలినీ పండిట్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లో ఆమెను కలిసిన వారంతా.. రాయగడ జిల్లాలో నెలకొన్న వైద్య సమస్యలపై చర్చించారు. గుణుపూర్ సబ్ డివిజన్ ఆస్పత్రి, జిల్లా కేంద్రాస్పత్రిలో ఖాళీగా ఉన్న 108 వైద్యుల పోస్టులను త్వరితగతిన భర్తీ చేయాలని పేర్కొన్నారు. ఆదివాసీ, హరిజన జిల్లాగా గుర్తింపు పొందిన రాయగడలో నివసిస్తున్న ఆదివాసీలంతా మెరుగైన వైద్యం కోసం ఈ రెండు ఆస్పత్రుల పైనే ఆధారపడుతుంటారని తెలిపారు. దీనికి అనుగుణంగా వైద్య సౌకర్యాలు మెరుగైన సేవలు అందించాలన్నారు. స్పందించిన ఆమె.. సెప్టెంబర్ లోగా ఖాళీగా ఉన్న అన్ని వైద్యుల పోస్టులను భర్తీ చేసేందుకు హామీ ఇచ్చారు.

సమ్మె ఎఫెక్ట్!

- డ్రైవర్ల ఆందోళనతో స్తంభించిన 2వేల ట్యాంకర్ ట్రక్కుల రవాణా
- రాష్ట్రవ్యాప్తంగా అడుగంటి పోతున్న పెట్రోల్, డీజిల్ నిల్వలు
- ఆకాశాన్నంటుతున్న కూరగాయల ధరలు
- నిరసనకారులతో చర్చించాలని రవాణా మంత్రిని ఆదేశించిన స్పీకర్



భువనేశ్వర్: సరుకులు, ఇంధనం రవాణా చేసే వాహనాలను నిలిచి పోవడంతో వర్ణనాతీతమైన ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఒడిశా డ్రైవర్ మహాసంఘం పిలుపు మేరకు రాష్ట్రంలో కొనసాగుతున్న స్టీరింగ్ విరమణ నిరవధిక సమ్మెతో ఈ పరిస్థితులు తాండవిస్తున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే శనివారం నుంచే రాష్ట్రంలో పెట్రోలు, డీజిల్ సంక్షోభం పరిస్థితిని ఎదుర్కోవాల్సి ఉంటుంది. రాష్ట్ర రాజధాని పరిసర ప్రాంతాల్లో పలు ఇంధన విక్రయ కేంద్రాల్లో పెట్రోల్, డీజిల్ నిల్వలు నిండుకోవడంతో మూసివేసినట్లు సమాచారం. రాష్ట్రంలో 1,600 పెట్రోలు బంకులకు పారాదీప్, బాలాసోర్, ఝూర్సుగూడ, జట్నీ డిపోల నుంచి పెట్రోల్, డీజిల్ ఇంధనం సరఫరా అవుతుంది. అయితే డ్రైవర్ల సమ్మెతో సుమారు 2వేల ట్యాంకర్ ట్రక్కుల్లో ఈ రవాణా స్తంభించిపోయింది. వాణిజ్య వాహనాల డ్రైవర్ల సమ్మె పిలుపు దృష్ట్యా, ఆందోళనకు ముందు చాలా ఇంధన కేంద్రాలు మంగళవారమే 3 రోజులకు సరిపడా ఇంధనం ముందస్తుగా నిల్వ చేయడంతో ఇప్పటి వరకు నిరాటంకంగా ఇంధనం లభ్యత సాధ్యమైందని ఉత్కళ పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సంజయ్‌లాథ్ తెలిపారు. గత రెండు రోజులుగా వాణిజ్య రవాణా వాహనాల రవాణా పూర్తిగా స్తంభించిన విషయం తెలిసిందే. క్రమంగా ఇంధన నిల్వలు అడుగంటి పోతున్నాయని ఆయన ముందస్తు సమాచారం జారీ చేశారు. ఈ పరిస్థితుల్లో వినియోగదారులు పరిమితి కొనుగోలు చేస్తే అందుబాటులో ఉన్న నిల్వలతో మరో 1, 2 రోజులు చలామణి అవుతుంది. లేకుంటే సంక్షోభం తక్షణమే తలెత్తే ప్రమాదం పొంచి ఉంటుందని హెచ్చరించారు.

చర్చలకు ఆహ్వానం..

దాదాపు శుక్రవారం మధ్యాహ్నం నుంచి రాష్ట్రవ్యాప్తంగా పెట్రోలు, డీజిల్ సంక్షోభం తలెత్తే ప్రమాదం ఉందని సంజయ్‌లాథ్ తెలిపారు. ఇదే పరిస్థితి చోటు చేసుకుంటే అంబులెన్స్ సేవలు ప్రభావితమయ్యే ప్రమాదం పొంచి ఉందన్నారు. డ్రైవర్ల సంఘం సమ్మె విరమిస్తే ఇంధన రవాణా వాహనాలు బయల్దేరేందుకు సిద్ధంగా ఉన్నాయని భరోసా ఇచ్చారు. పెట్రోల్, డీజిల్‌ను నిత్యావసర వస్తువులుగా పరిగణిస్తున్నందున డ్రైవర్ల సమ్మె పరిధిలోకి రాకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని కూడా నొక్కి చెప్పారు. రాష్ట్రంలో నిత్య వినియోగం కోసం డీజిల్ సగటున 6వేల లీటర్లు, పెట్రోల్ 2,750 కిలో లీటర్లు అవసరం ఉంటుందని వివరించారు. సమ్మె కారణంగా కూరగాయల సరఫరా, నిత్యావసర వస్తువుల సరఫరా కూడా ప్రభావితమైంది. దీంతో ప్రజలు కిరాణా, కూరగాయల దుకాణాల వద్ద బారులు తీరుతున్నారు. ఈ సరుకుల ధరలు రెట్టింపు అవుతున్నాయి. ఇదిలా ఉండగా.. ఆందోళన చేస్తున్న డ్రైవర్లతో చర్చించి శుక్రవారం సభలో వివరణ ప్రవేశపెట్టాలని రవాణాశాఖ మంత్రి టుకుని సాహుకు శాసనసభ స్పీకర్ బిక్రమ్ కేశరీ అరూఖ్ గురువారం ఆదేశించారు.



బరంపురం ఫస్ట్‌గేట్ వద్ద ప్రధాన రహదారిపై ఆందోళనకారులు

యూనిట్-1 మార్కెట్లో ధరలు (రూపాయల్లో)

కూరగాయలు (కిలోల్లో)	బుధవారం	గురువారం
వంకాయలు	20	60
బరబటీలు	40	70
పొటల్స్	100	130
సారకంద	40	60
బీన్స్	70	120
దోసకాయలు	30	50
క్యాబేజీ	10	20

జాతీయ రహదారులపై తిష్ట..

సామాజిక భద్రత, పెన్షన్‌తో సహా 10 ప్రధాన డిమాండ్లతో ఒడిశా డ్రైవర్ల మహాసంఘం బుధవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మెను ప్రారంభించింది. సంక్షేమ నిధి ఏర్పాటు, మరణాంతరం కుటుంబానికి ప్రయోజనాలు, 60 ఏళ్లు నిండిన వారికి పింఛన్ తదితరాలు తమ డిమాండ్లలో ఉన్నాయి. ఆందోళన చేస్తున్న డ్రైవర్లు రాష్ట్రంలోని పలు చోట్ల ప్రదర్శనలు నిర్వహించి పికెటింగ్‌లకు దిగారు. ఆందోళనకారులు జాతీయ రహదారులపై వాణిజ్య వాహనాలను నిలిపి వేశారు.

నిన్న.. నేడు..

భువనేశ్వర్: రాష్ట్రంలో డ్రైవర్ల ఆందోళన కొనసాగుతుండటంతో కూరగాయల ధరలపై ప్రభావం కనిపిస్తోంది. నగరంలో కూరగాయల ధరలు విపరీతంగా పెరిగాయి. రెండు రోజులుగా లారీ రవాణా స్తంభించడంతో ఈ పరిస్థితి తలెత్తిందని వ్యాపారులు చెబుతున్నారు. మరో సగం ట్రక్కులు మార్గమధ్యలో రోడ్డుపై ఇరుక్కుపోయాయి. ఈ పరిస్థితుల్లో పరిసర ప్రాంతాల నుంచి కూరగాయల దిగుమతికి గండిపడింది.



యూనిట్-1 మార్కెట్లో కూరగాయల విక్రయాలు

నేటి నుంచే శాంతమ్మ సంబరాలు



ప్రత్యేక అలంకరణలో మాబుడి శాంతమ్మ



సంబరాల్లో మాబుడి శాంతమ్మ ఘటయాత్ర(ఫైల్)

- అర్ధరాత్రి శుభరాటకు పూజల అనంతరం లాంఛనంగా ప్రారంభం

బరంపురం: ప్రతి రెండేళ్లకు ఒకసారి జరిగే, రాష్ట్రప్రభుత్వ అధికారిక ఉత్సవాలుగా గుర్తింపు పొందిన బరంపురం గ్రామదేవత, దక్షిణ ఒడిశా ప్రజల ఇలవేల్పు మాబుడి శాంతమ్మ సంబరాలు శుక్రవారం అర్ధరాత్రి నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం స్థానిక దేశి బెహరా వీధిలో అమ్మవారి తాత్కాలిక మందిర ప్రాంగణంలో సంబరాల నిర్వాహకులు పాత్రర్ల దుర్గాప్రసాద్ దేశి బెహరా సారథ్యంలో వేద పండితులు వేమగోటి వాసుదేవ్ శాస్త్రీ శుభరాటకు ముహూర్తం ఖరారు చేశారు. దీనిప్రకారం శుక్రవారం అర్ధరాత్రి శుభరాటతో వేదమంత్రాలు, బాజా భజంత్రీలు, మంగళ వాయిద్యాల మధ్య ఊరేగింపుగా స్థానిక శాంతమ్మ ఆలయానికి చేరుకుంటారు. దశాబ్దాల సంప్రదాయాల మేరకు శుభరాటకు ఆలయ ప్రధానార్చకులు ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం దేశి బెహరా ఆలయం నుంచి నగర ప్రముఖులతో కలిసి తాత్కాలిక మందిర ప్రాంగణంలో శుభరాటను నిలుపుతారు. దీనికి అనుగుణంగా సంబరాల మూహర్తాన్ని జిల్లా కలెక్టర్‌కు లిఖిత పూర్వకంగా అందజేయనున్నట్లు దేశి బెహరా వివరించారు.

మరింతమంది ‘ఉపకారం’ పొందాలి

- అధికారుల సమీక్షలో కలెక్టర్ లింగరాజ్ పండా



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ లింగరాజ్ పండా

పర్లాకిమిడి: జిల్లాలోని ఉన్నత విద్య అభ్యసిస్తున్న పేద, కార్మిక, వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థులు ఉపకార వేతనాలు పొందేందుకు అనుగుణంగా సంక్షేమ, గిరిజన పాఠశాలలు, ఆదర్శ విద్యాలయాల అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ లింగరాజ్ పండా ఆదేశించారు. దీనిని విద్యార్థులు సైతం వినియోగించుకుని, ఎక్కువమంది ప్రభుత్వం తరఫున సాయం పొందాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాయం హాల్‌లో యాక్షన్ ఎయిడ్ సమన్వయంతో గురువారం జిల్లాస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేద, ఆదివాసీ, వెనుకబడిన విద్యార్థులకు రాష్ట్రప్రభుత్వం 11రకాలైన భృతి అందజేస్తోందన్నారు. బిజూ సురక్షా యోజనా పథకం, గ్రీన్ ఫేజ్ పథకం కింద తల్లిదండ్రులు కోల్పోయిన విద్యార్థులకు ప్రభుత్వం రూ.5 లక్షల వరకు భృతి అందిస్తోందని తెలిపారు. వీలైనంత ఎక్కువమంది ఈ లబ్ధి పొందేలా అధికారులు, బీఈఓలు కృషి చేయాలన్నారు. అలాగే భవన నిర్మాణ కార్మికుల పిల్లలకు గోపబంధు శిక్షా సహాయత పథకం కింద ఏడాదికి రూ.20 వేలు, జూనియర్ మెట్రిక్ కింద రూ.10 వేలు, పోస్టుమెట్రిక్, ఆశీర్వాద్ యోజనా పథకం, పఠానీ సామంత్ గణిత ప్రతిభా ఛత్ర భృతి కింద రూ.5 వేలు, కలియా ఛత్ర భృతి క్రింద హాస్టల్, మెస్ చార్జీలకు రూ.2 వేలు అందించనున్నట్లు వివరించారు. అర్హులైన వారి వివరాలను ప్రతి బ్లాక్ స్థాయిలో విద్యాకేంద్ర అధికారులు నమోదు చేయాలని ఏడీఎం సంగ్రాంశేఖర పండా సూచించారు. సమావేశంలో డీఆర్‌డీఏ ఈఓ రమాంచల్ ఖమారీ, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

కలకలం రేపిన కపోతం



పతిసాహీలో పట్టుబడిన పావురం

భువనేశ్వర్: పూరీ జిల్లా అస్తరాంగ్ మండలం నాస్‌పూర్ ప్రాంతం పతిసాహీలో అనుమానాస్పదంగా తారసపడిన పావురం పట్టుబడింది. దీని రెండు కాళ్లకు రింగుల వంటి ట్యాగ్‌లు, రెక్కలపై తెలియని భాషలో రాతలు ఉన్నట్లు గుర్తించారు. దీని పట్ల పలు సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. గూఢచర్య వ్యవహారాలకు ఈ పక్షిని వినియోగిస్తున్నట్లు అనుమానాలు బలపడుతున్నాయి. పతిసాహీలో ఉంటున్న రూపస్‌పతి ఇంటి మేడపై పెంచుతున్న పావురాల గుంపులో ఇది తిరుగాడుతున్నట్లు గుర్తించారు. కాళ్లకు రింగులు వంటివి తారస పడడంతో అనుమానంతో అదుపులోకి తీసుకుని పరిశీలించారు. ఈ కపోతాన్ని స్థానిక పోలీసులు స్వాధీన చేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు.

వేధింపులు తాళలేకున్నాం..

- సమ్మెలో పాల్గొనకుండా బస్సులు నడుపుతున్న ప్రైవేటు యజమానులు
- ఉద్దేశపూర్వంగా రోడ్డు పైనే సర్వీసులు అడ్డుకుంటున్న డ్రైవర్ల మహాసంఘ్



డ్రైవర్ల ఐక్య మహాకూటమి ప్రతినిధులతో సీఎస్ ప్రదీప్ జెనా చర్చలు

భువనేశ్వర్: సమ్మె చేస్తున్న డ్రైవర్ల మహాసంఘ్ కార్యకర్తల వేధింపులకు కళ్లెం వేయకుంటే బస్సులు నడిపేది లేదని అఖిల ఒడిశా ప్రైవేటు బస్సు యజమానుల సంఘం ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా స్టీరింగ్ విరమణతో నిరవధికంగా సమ్మెకు దిగిన వర్గీయులు ప్రైవేటు బస్సు కార్మికులను రోడ్డుపైనే వేధిస్తున్నారు. తగిన పోలీసు రక్షణ లేకపోవడంతో బస్సులు నడిపేందుకు వీలులేని పరిస్థితులు తాండవిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో తాము కూడా సమ్మెకు నడుం బిగించాల్సి ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ రహదారులపై సరుకు రవాణా వాహనాల నిలుపుదల తొలగించకుంటే ప్రైవేటు బస్సుల నడిపేందుకు అనుకూల పరిస్థితులకు తావు లేదు. ఈ దిశలో ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టకుంటే రాష్ట్రవ్యాప్తంగా 14వేలకు పైగా బస్సుల రవాణా నిలిపివేతకు ప్రేరేపించడం అనివార్యం అవుతుందని అఖిల ఒడిశా ప్రైవేటు బస్సు యజమానుల సంఘం(ఏఓపీబీఓఏ) గురువారం హెచ్చరించింది.

పోలీసులు లేకపోవడంతోనే..

బుధవారం నుంచి ప్రారంభమైన డ్రైవర్ల మహాసంఘ్ సమ్మెలో పాల్గొనని ప్రైవేట్ బస్సు యజమానుల వర్గం తమ వాహనాలను నడపడానికి అంగీకరించింది. గురువారం ఉదయం ప్రైవేట్ బస్సులు రోడ్లపైకి రాగా, పలు చోట్ల వాణిజ్య వాహనాల డ్రైవర్లు అడ్డుకోవడంతో ఆందోళనకర పరిస్థితులు తలెత్తాయి. పోలీసు రక్షణ లేకపోవడంతో ఈ పరిస్థితి అనివార్యమైనట్లు సంఘం ఆరోపించింది. వాహనాలు నడిపేందుకు ప్రైవేట్ బస్సుల సిబ్బంది, కార్మికులకు తగిన రక్షణ కల్పిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం విఫలమైందని అఖిల ఒడిశా ప్రైవేటు బస్సు యజమానుల సంఘం ప్రధాన కార్యదర్శి దేబేంద్రకుమార్ సాహు మీడియాకు వివరించారు. ‘మా సిబ్బందిలో చాలా మందిని ఆందోళన చేస్తున్న డ్రైవర్లు వేధించారు. కొన్నిచోట్ల నిర్బంధించారు. ఇక మా బస్సులను ఆపడం తప్ప వేరే మార్గం లేదు’ అని తెలిపారు.

నిలిచిన 14,000 బస్సులు..

డ్రైవర్ల సమ్మెతో రాష్ట్రవ్యాప్తంగా జాతీయ రహదారిపై నిలిచిపోయిన వాహనాలను తొలగించి మార్గం సుగమం చేయకుంటే ప్రైవేటు బస్సులు నడిపేందుకు ఏమాత్ర వీలుపడని పరిస్థితులు తాండవిస్తున్నాయి. ఈ నేపథ్యంలో చర్యలు తీసుకోవాలని బస్సు యజమానుల వర్గం పట్టుబట్టింది. ప్రభుత్వం ఈ చర్యను చేపట్టడంలో విఫలమైతే గురువారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు బస్సు సర్వీసులను నిలిపివేస్తామని సాహు స్పష్టం చేశారు. రాష్ట్రంలో 30 జిల్లాల జాతీయ రహదారులపై వాహనాలను నిలిపి వేసి బస్సుల యజమానులంతా నిరసనలు ప్రదర్శిస్తారని తెలిపారు. ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టకుంటే నిరవధికంగా ఇదే పరిస్థితి కొనసాగుతుందని హెచ్చరించారు. రాష్ట్రంలో దాదాపు 14,000 ప్రైవేట్ బస్సులు రోడ్లపైకి రాకుండా సుమారు 8వేల మంది యజమానులు రంగంలోకి దిగుతారని హెచ్చరించారు.

చర్చలపై నిశ్శబ్దం..!

భువనేశ్వర్: రాష్ట్రవ్యాప్తంగా డ్రైవర్ల ఆందోళన కారణంగా వాహన రాకపోకలు స్తంభించడంతో రెండో రోజు గురువారం చెదురుమదురుగా హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి. మరోవైపు 3 నెలల్లో సమస్యలను పరిష్కరిస్తామని రాష్ట్రప్రభుత్వం ఆందోళన చేస్తున్న డ్రైవర్లకు హామీ ఇచ్చింది. ఇంత జరిగినా ఆందోళనకారుల వర్గం నోరు మెదపకుండా మౌనం వహించింది. ఆందోళనకు సారథ్యం వహిస్తున్న డ్రైవర్ల ఐక్య మహాకూటమి ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్ జెనా ఈ హామీ ఇచ్చారు. జెనా అధ్యక్షతన గురువారం సాయంత్రం 7 గంటల సమయంలో సచివాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో సమావేశం జరిగినట్లు సీఎస్ కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. అయితే ప్రభుత్వ హామీ పట్ల డ్రైవర్ల ఐక్య మహాకూటమి స్పందన లేకుండా వెనుదిరిగిందని ఈ ప్రకటన పేర్కొంది.

క్లుప్తంగా

రక్షణ చట్టాలపై అవగాహన



శిబిరంలో మాట్లాడుతున్న సుమన్ జెనా

జయపురం: బాలల రక్షణ, బాల్య వివాహాలు, నిర్బంధ విద్య తదితర చట్టాలపై ప్రజలలో అవగాహన కల్పించేందుకు జిల్లా న్యాయసేవా ప్రాధికరణ సంస్థ ముందుకు వచ్చింది. ఈ మేరకు జయపురం సమితి మొటపాడ గ్రామంలో గురువారం న్యాయ సచేతన శిబిరం నిర్వహించారు. ఇందులో శాశ్వత లోక్ అదాలత్ న్యాయాధికారి సుమన్ జెనా మాట్లాడుతూ బాల్య వివాహాలు సమాజంలో సమస్యలకు కారణమవుతాయని, దీనిని నిర్మూలించాలని కోరారు. బాలల రక్షణ, న్యాయం చేకూర్చేందుకు చట్టాలు ఉన్నాయని వీటిని వినియోగించుకోవాలని సూచించారు. శిబిరంలో పారా లీగల్ వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పంపు సెట్ల నిందితులు అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితులు కిరీటి, ప్రహ్లాద్

జయపురం: రాష్ట్రప్రభుత్వం రైతులకు సాగునీటి కోసం సరఫరా చేస్తున్న జలనిధి పథకం మోటారు పంపులను అపహరించిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశామని జయపురం సదర్ పోలీసు అధికారి ఈశ్వర తండి గురువారం వెల్లడించారు. నిందితులు ఇదే సమితిలోని పల్లిగుడకు చెందిన కిరీటి అలియాస్ భక్తరామ్ హరి జన్(18), మాలి దొలైపుట్ గ్రామానికి చెందిన ప్రహ్లాద గౌడ(56)గా ప్రకటించారు. పంట పొలాలకు సాగునీరు సమకూర్చుకొనేందుకు జలనిధి యోజనలో భాగంగా పూజారిపుట్, దొలైపుట్ గ్రామాల రైతులకు 8మోటారు పంపులు అధికారులు సమకూర్చారు. ఈనెల 10న ఆ పంపులన్నీ అపహరణకు గురయ్యాయి. ఈ సందర్భంగా పూజారిపుట్‌కు చెందిన బాధిత రైతు సురేంద్ర నాథ్ పాణిగ్రాహి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో రాజేష్, కలియ, కిరీటి, ప్రహ్లాద్ పంపు సెట్లను దొంగిలించినట్లు తేలింది. ఇందులో కిరీటి, ప్రహ్లాద్ పట్టుబడగా.. మిగిలిన వారు పరారీలో ఉన్నారు. దొంగలించిన సామగ్రిని కలిగాం సమీపంలోని తోటలో దాచి ఉంచినట్లు తేలడంతో రికవరీ చేశారు. పరారైన వారి కోసం గాలిస్తున్నామని, త్వరలోనే పట్టుకుంటామని ఈశ్వర తండి వివరించారు. కేసును ఎస్‌ఐ రాజకిశోర్ బారిక్ దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మత్తు పదార్థాలను నియంత్రించండి



అడిషనల్ ఎస్పీకి వినతి పత్రం అందజేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా కేంద్రంలో విచ్చలవిడిగా సాగుతున్న గుట్కా, ఖైనీ, గంజాయి, డ్రగ్స్ వంటి మత్తుపదార్థాల కార్యకలాపాలను నియంత్రించేందుకు కఠిన చర్యలు చేపట్టాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి యుగంధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు జిల్లా అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వరరావుకు గురువారం వినతి పత్రం అందజేశారు. గంజాయి, డ్రగ్స్‌తో యువత మత్తుకు బానిసలవుతున్నారని చెప్పారు. మెడికల్ మాఫియా తీవ్రంగా పెరిగిందని, నాసిరకం మందులతో ప్రజలు తీవ్ర అనారోగ్యం పాలవుతున్నారని చెప్పారు. సోషల్ మీడియాలో అశ్లీల చిత్రాలను కట్టడి చేయాలని విన్నవించారు. అనంతరం అడిషనల్ ఎస్పీ స్పందిస్తూ ప్రత్యేక బృందం వేసి నివారణ చర్యలు చేపడతామని తెలిపారు.

కొళిగాంలో యువకుడు ఆత్మహత్య

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని కొళిగాం గ్రామానికి చెందిన యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సురేంద్ర మండలా రెండో కుమారుడు స్వరాజ్ మండలా(23) స్థానిక ఇటుక బట్టీలో మూడేళ్లగా గుమస్తాగా పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి ఇటుకబట్టీ ప్రాంతంలోని ఓ చెట్టుకు ఉరివేసుకుని మృతి చెందినట్లు కూలీలు గుర్తించారు. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు, క్లూస్ టీంలు ఘటనా స్థలానికి వెళ్లి దర్యాప్తు చేశారు. మృతదేహాన్ని గురువారం ఇచ్ఛాపురం సామాజిక ఆస్పత్రికి తరలించి శవ పంచనామా నిర్వహించారు. తండ్రి సురేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్న పట్టణ ఎస్‌ఐ కె.గోవిందరావు తెలిపారు. పెద్ద కుమారుడు సురేష్ మండలా ఏడాదిన్నర క్రితం హరిపురంలో ఇంటికి విద్యుత్ పనులు చేస్తుండగా విద్యుత్ షాక్‌తో మరణించగా, ఇప్పుడు రెండో కొడుకు కూడా మృతిచెందడంతో తల్లి కుంబాల మండలా కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. ఆత్మహత్యకు గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ బి.రామారావు తెలిపారు.

చూడచక్కగా..

- ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణ పోటీలు
- ఉత్సాహంగా కొనసాగుతున్న ఉగాది ఉత్సవాలు



లవ, కుశ వేషధారణలో చిన్నారులు



పోటీలో పాల్గొన్న చిన్నారులు



పోటీలను ప్రారంభిస్తున్న మున్సిపాలిటీ చైర్మన్ మహేష్ పట్నాయక్

రాయగడ: ఉగాది ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న వివిధ పోటీలు ఆకట్టుకుంటున్నాయి. పట్టణంలోని తేజస్విని హోటల్ ఎదురుగా ఉన్న మైదానంలో ఉత్సవ కమిటీ గురువారం చేపట్టిన వేషధారణ పోటీలు భారతీయ సంస్కృతిని ప్రతిబింబించాయి. రాయగడ మున్సిపాలిటీ చైర్మన్ మహేష్ పట్నాయక్ ముఖ్య అతిథిగా హాజరై అండర్–15 విభాగం పోటీలను ప్రారంభించగా, 282మంది బాల, బాలికలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళలకు పుట్టినిళ్లుగా వెలుగొందుతున్న దేశంలో సంస్కృతికి అద్దం పట్టేలా వేషధారణ పోటీలు నిర్వహించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఎంతో ఆసక్తితో చిన్నారులు పాల్గోవడం ఆనందకరమని, వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఈ తరహా కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని గుర్తుచేశారు. ఉగాది వంటి పర్వదినాల్లో తెలుగు సంస్థలు నిర్వహించే కార్యక్రమాలకు పిల్లలను తీసుకువెళ్లే అలవాటును తల్లిదండ్రులు అలవాటు చేసుకోవాలని సూచించారు. దీనివల్ల సంస్కృతి, సంప్రదాయాలు వారికి అలవడతాయని వివరించారు.

పర్యవేక్షించిన నెక్కంటి..

తెలుగు వారికి ప్రత్యేకమైన ఉగాది.. ఒడియా వారికి పానా సంక్రాంతి వంటి పర్వదినాల్లో అంతా కలసికట్టుగా వేడుకలు జరుపుకోవాలని రాయగడ సమితి చైర్‌పర్సన్ టున్నీ హుయిక ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ భిన్నజాతులు గల రాష్ట్రంలో అందరి సంప్రదాయ, సంస్కృతులను గౌరవించాలని సూచించారు. ఇటువంటి వేడుకలు ఐకమత్యంతో నిర్వహించుకోవాలని గుర్తుచేశారు. కార్యక్రమానికి హాజరైన రాజ్యసభ మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు వేషధారణలతో ఉన్న చిన్నారులతో కొద్దిసేపు గడిపారు. వారితో ఫొటోలకు పోజులిచ్చారు. పిల్లలు కూడా ఆయనతో సరదాగా సెల్ఫీలు దిగారు.

సంస్కృతికి అద్దం పట్టే విధంగా..

పిల్లల వేషధారణ పోటీలు భారతీయ సంస్కృతికి అద్దం పట్టేవిధంగా ఉన్నాయి. రామాయణాన్ని గుర్తుచేసుకునే విధంగా లవకుశ, జాతిని గౌరవించే భారతమాత, వేంకటేశ్వర, శివుడు వంటి వేషాధారణలు ఆకట్టుకున్నాయి. అదేవిధంగా తెలుగు సంస్కృతిని ప్రతిబింబించే కట్టుబొట్టు వస్త్రాలంకరణలు ప్రత్యేకంగా నిలిచాయి. పోటీలకు జీడీ చౌధరి, డి.శోభారాణి, పి.రమాదేవి, జిల్లా సాంస్కృతిక శాఖ అధికారి సచిత్ర బౌరి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. విజేతల వివరాలు ఉగాది వేదిక వద్ద ప్రకటించనున్నారు. పాల్గొన్న చిన్నారులందరికీ నిర్వాహకులు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉగాది ఉత్సవ కమిటీ కోశాధికారి ఇప్పిలి సన్యాసిరాజు, బి.తిరుపతిరావు, ముంజేటి గంగాధర్, నిర్వాహకులు పతివాడ వనిత, పీవీపీ రాము, కేసీ నెక్కంటి తదితరులు పాల్గొన్నారు.



ఆకట్టుకుంటున్న చిన్నారుల వేషధారణలు



కార్యక్రమానికి హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులు



పాల్గొన్న వారికి ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

అసెంబ్లీని తాకిన ఆందోళన

- డ్రైవర్ల సమ్మెపై శాసనసభలో విపక్షాల మండిపాటు
- పదే పదే సభ మధ్యలోకి దూసుకు వచ్చిన ఎమ్మెల్యేలు



ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులతో చర్చలు జరుపుతున్న విద్యాశాఖ మంత్రి సమీర్ రంజన్‌దాస్

భువనేశ్వర్: స్టీరింగ్ విరమణ నినాదంతో మోటార్ వాహనాల డ్రైవర్ల వర్గం ఆందోళనకు దిగింది. రాత్రింబవళ్లు వీరి ఆందోళన నిరవధికంగా కొనసాగుతోంది. మరోవైపు శాసనసభలో ఈ విషయమై చర్చ జరిగే సమయంలో అనుబంధ విభాగాల ఉన్నతాధికారులు గైర్హాజరు అవుతున్నారని కాంగ్రెస్ శాసనసభ నాయకుడు నర్సింహ మిశ్రా ఆరోపించారు. డ్రైవర్ల సమస్యలు పరిష్కారం కావాలని ఉభయ ప్రతిపక్షాలు కాంగ్రెస్, బీజేపీ సభ్యులు కలకలం రేపారు. దీంతో సభలో గందరగోళ వాతావరణం నెలకొంది. ఈ పార్టీల ఎమ్మెల్యేలు సభ మధ్యలోకి వచ్చి రచ్చ చేశారు. జీరో అవర్‌లో కాంగ్రెస్ శాసనసభ నాయకుడు నర్సింహ మిశ్రా డ్రైవర్ల ఆందోళన విషయం ప్రస్తావించడంతో సభలో వాతావరణం వేడెక్కింది. సమస్యలను పరిష్కరించి వారికి సహాయం చేయడానికి బదులుగా వర్గ విభేధాలు ప్రేరేపిస్తుందని ఆరోపించారు. డ్రైవర్ల సంఘాల్లో విభేధాలు రెచ్చగొట్టే ప్రయత్నంతో ఆందోళన నీరుగార్చే దిశలో ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. వర్గాన్ని ప్రవేశపెట్టి ఉద్యమాన్ని ఆందోళనతో రవాణా సేవలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. ఈ మేరకు సభలో చర్చ జరిగినప్పుడు అనుబంధ విభాగాల అధికారులు లేకపోవడంతో బలవంతంగా సభ మధ్యలోకి వెళ్లాల్సి వస్తోందని విపక్షాల సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకుని భావోద్వేగంతో బీజేపీ సభ్యులు ఏకీభవించి, సభ మధ్యలోకి వచ్చి రభసకు దిగారు. డ్రైవర్లు బుధవారం నుంచి హైవేపైకి వచ్చి తమ హక్కుల కోసం రాత్రింబవళ్లు శ్రమిస్తున్నారు. అయితే ప్రభుత్వం మౌనంగా ఉంది. ఈ కీలక అంశంపై సభలో ఉద్రిక్తత నెలకొంది. ఆశాఖ మంత్రి సభలో తాను అడిగిన ప్రశ్నలకు ఆలస్యం చేయకుండా సమాధానం ఇవ్వాలని, డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని ప్రతిపక్ష నేత జయనారాయణ మిశ్రా డిమాండ్ చేశారు. అనంతరం సభ నిర్వహణకు స్పీకర్ అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

మంత్రితో చర్చలు..

భువనేశ్వర్: గత 3నెలలుగా ఉపాధ్యాయులు జరిపిన సంప్రదింపుల పట్ల ప్రభుత్వం నుంచి స్పందన కొరవడింది. దీంతో ఉద్యమానికి సిద్ధమైనా.. ప్రభుత్వం అడ్డుకుంది. దీంతో ప్రభుత్వ తీరుపై ప్రాథమిక ఉపాధ్యాయుల వర్గం మండిపడుతోంది. బుధవారం తలపెట్టిన ఉద్యమానికి పోలీసులు అనుమతించక పోవడంతో మరింత ఆగ్రహానికి గురయ్యారు. ఈ నేపథ్యంలో పాఠశాలలు, సామూహిక విద్యాశాఖ మంత్రి సమీర్ రంజనదాస్ యునైటెడ్ ప్రైమరీ టీచర్స్ యూనియన్ సభ్యులతో చర్చించారు. అసెంబ్లీలోని మంత్రి ఛాంబర్‌లో బుధవారం ఇరువర్గాల మధ్య చర్చ జరిగింది. ఉపాధ్యాయ సంఘం తరఫున 11మంది సభ్యులతో కూడిన ప్రతినిధి బృందం తమ డిమాండ్లను మంత్రికి వివరించింది. ఉన్నత స్థాయి కమిటీతో ఉపాధ్యాయుల వర్గం గతంలో చర్చించింది. తాజాగా సమర్పించిన డిమాండ్ల వివరాలను ఈ కమిటీకి సిఫార్సు చేయడం జరుగుతుందని మంత్రి సమీర్ తెలిపారు. వీరి డిమాండ్లను చర్చల ద్వారా పరిష్కరిస్తామన్నారు. త్వరలో పలు దశల్లో చర్చల నిర్వహించనున్నట్లు వివరించారు.

యూనిఫాం లేకుండా...

మంత్రి సమీర్ రంజన్‌దాస్ హామీతో ఉపాధ్యాయుల వర్గం మెట్టు దిగింది. గురువారం నుంచి ప్రాథమిక ఉపాధ్యాయులు యూనిఫాం లేకుండా విధులకు హాజరవుతామని యునైటెడ్ ప్రైమరీ టీచర్స్ యూనియన్ ప్రకటించింది. తమ డిమాండ్లను మంత్రివర్గ కమిటీకి పంపుతామని మంత్రి హామీ ఇచ్చారు. అయితే అనుబంధ భృతి మంజూరుకు ప్రభుత్వం నిరాకరించింది. ఈ నేపథ్యంలో యూనిఫాం లేకుండా విధులకు హాజరవుతామని ప్రకటించినట్లు తెలిపారు.

పోలీసులపై బాంబు దాడి



సిద్ధార్థ విహార్‌లో దర్యాప్తు చేస్తున్న పోలీసులు



దుండగులను అదుపులోకి తీసుకుంటున్న పెద్ద బజార్ పోలీసులు

- ఇద్దరు మహిళలు సహా ఐదుగురు నిందితుల అరెస్ట్
- పర్యవేక్షించిన ఎస్పీ సరవణ్ వివేక్

బరంపురం: నగర శివారు సిద్ధార్థ విహార్‌లో ఓ కేసు దర్యాప్తు విషయమై వెళ్లిన పోలీసులపై దుండగులు బాంబులతో దాడికి పాల్పడ్డారు. దీంతో అప్రమత్తమైన సిబ్బంది.. చాకచక్యంగా వ్యవహరించి, ముగ్గురు మహిళలు సహా ఐదుగురు నిందితులను అరెస్ట్ చేశారు. దీనిపై బరంపురం ఎస్పీ సరవణ్ వివేక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెద్ద బజార్ పోలీసు స్టేషన్ పరిధిలోని సిద్ధార్థ విహార్‌లో గతంలో జరిగిన బాంబు దాడి కేసు విచారణ నిమిత్తం పోలీసులు గురువారం వెళ్లారు. అయితే సిబ్బందిని గమనించిన నిందితులు, వారి నుంచే తప్పించుకునేందుకు బాంబులతో దాడికి దిగారు. అప్రమత్తమైన పోలీసులు అదనపు బలగాలకు సమాచారం అందించారు. ఎస్పీ సరవణ్ వివేక్ స్వయంగా రంగంలోకి దిగగా.. ఇద్దరు మహిళలు, మరో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వీరిని పెద్ద బజార్ పోలీసు స్టేషన్‌కు తరలించి, విచారిస్తున్నారు. దుండగుల నుంచి కొన్ని బాంబులు స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తు పూర్తయిన అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఎస్పీ తెలిపారు.

లోతట్టు ప్రాంతాల్లో స్టేట్‌బ్యాంక్ సేవలు



నూతన బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ విశాల్‌సింగ్



మహిళా సంఘాలకు రుణాల చెక్కును అందిస్తున్న కలెక్టర్, బ్యాంక్ అధికారులు

మల్కన్‌గిరి: జిల్లాలోని మల్కన్‌గిరి సమితి సీక్‌పల్లి పంచాయతీ పరిధి కోడిమెట్ల గ్రామంలో భారతీయ స్టేట్ బ్యాంక్ నూతన శాఖను కలెక్టర్ విశాల్‌సింగ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా 7 సమితుల్లోని ఒక్కో శాఖకు రూ.10 కోట్ల 47 లక్షలు రుణాలు మంజూరు చేశారు. ఈ రుణాలను చిరు వ్యాపారులు, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు అందజేశారు. ఇకపై గ్రామాల్లో ఏర్పాటు చేసిన బ్యాంక్ లోనే రుణాలు పొందవచ్చని ఈ సందర్భంగా కలెక్టర్ తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ చంద్రశేఖర్ శర్మ, సీనియర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీనియర్ ఐపీఎస్ అధికారికి హెచ్‌ఆర్‌పీసీ నోటీసులు



ఏబీ భారతి

భువనేశ్వర్: ఒడిశా కేడర్‌కు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి ఏబీ భారతికి మానవ హక్కుల పరిరక్షణ శాఖ గురువారం బహిరంగ నోటీసు జారీ చేసింది. 2017 నుంచి సుదీర్ఘకాలం అనధికారికంగా విధులకు గైర్హాజరు కావడంతో ఈ మేరకు తాఖీదులు జారీ చేసినట్లు స్పష్టం చేయడం విశేషం. ఆమె 1998 బ్యాచ్ ఒడిశా కేడర్ ఐపీఎస్ అధికారి. నోటీసులో కోరిన మేరకు సంతృప్తికరమైన వివరణ దాఖలు చేసేందుకు 15 రోజుల గడువు కల్పించారు. నిర్దిష్ట గడువు లోటా లిఖిత పూర్వకంగా లేదా వ్యక్తిగత హాజరుతో వివరణ దాఖలు కాకుంటే సహేతుకమైన వివరణ లేదని భావించి విచారణ అధికారి పరిశీలన మేరకు తుది నిర్ణయం ఏకపక్షంగా అమలు చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. 2017లో భారతికి వ్యతిరేకంగా క్రమశిక్షణ చర్యల ప్రక్రియ ప్రారంభించగా, 2020లో విచారణ చేపట్టారు. పలుమార్లు విచారణ హాజరు కోసం జారీ చేసిన తాఖీదుల పట్ల బేఖాతరు వైఖరి ప్రదర్శించారు. ఈ పరిస్థితుల్లో ఆమె గైర్హాజరులో విచారణ కొనసాగించారు. ఈ విచారణలో నిందిత అధికారి క్రమశిక్షణ ఉల్లంఘన, చట్టబద్ధమైన ఆదేశాల పట్ల నిర్లక్ష్యం, విధి నిర్వహణలో బాధ్యతారాహిత్యం ఆరోపణలకు పాల్పడినట్లు తేల్చారు.

గత ఐదేళ్లుగా..

2017 నవంబర్ 23నుంచి భారతి విధులకు హాజరు కాకుండా సంప్రదింపులకు అందుబాటులో లేకుండా అజ్ఞాతంలో ఉండటం పట్ల అధికారిక చర్యల్లో కదలిక పుంజుకుంది. 2019 నవంబర్‌లో మరోసారి అందుబాటులోకి వచ్చి కనుమరుగయ్యారు. అక్టోబరు 29న విచారణకు హాజరు కావాలని ఒడిశా క్రైమ్ రికార్డ్స్ బ్యూరో అదనపు డైరెక్టర్ జనరల్(ఏడీజీ) కార్యాలయం 2021 సెప్టెంబర్‌లో భారతికి పబ్లిక్ నోటీసు జారీ చేసింది. తదుపరి దశల్లో చేపట్టిన విచారణకు ఆమె హాజరు కాకపోవడంతో తాజాగా మరోసారి పబ్లిక్ నోటీసు జారీ చేశారు.

బావిలో పడిన వృద్ధురాలు

- కాపాడిన అగ్నిమాపక సిబ్బంది

సోంపేట: సోంపేట పట్టణానికి చెందిన వృద్ధురాలు బావిలో పడగా.. అగ్నిమాపక సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించి కాపాడారు. రామాలయం వీధికి చెందిన 70 ఏళ్ల వృద్ధురాలు పొందర యశోద అదుపుతప్పి నేలబావిలో పడిపోయింది. వెంటనే స్థానికులు స్పందించి అగ్నిమాపక సిబ్బందికి ఫోన్ చేశారు. సిబ్బంది సకాలంలో చేరుకుని తాడు సహాయంతో వృద్ధురాలిని బయటకు తీశారు. అనంతరం 108లో సామాజిక ఆస్పత్రికి తరలించారు. అగ్నిమాపక శాఖాధికారి ఎస్.వరహాలు, సిబ్బంది ఎస్.మోహనరావు, ఆర్.సింహాచలం, ఎం.నరసింగరావు, ఎల్.నరేష్, ఎం.ఎం.దత్తా తదితరులు పాల్గొన్నారు.

కవితా నిలయం ఉగాది పురస్కార గ్రహీతలు వీరే

శ్రీకాకుళం కల్చరల్: కవితా నిలయం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది సాహిత్య పురస్కారాల పోటీల్లో విజేతలను అధ్యక్ష, కార్యదర్శులు మహ్మద్ రఫీ (ఈ వేమన), భోగెల ఉమామహేశ్వరరావు గురు వారం ఒక ప్రకటనలో వెల్లడించారు. పార్వతీపురానికి చెందిన చింతా అప్పలనాయుడు (అరిసేతిలో బువ్వపువ్వు) ప్రథమ, శ్రీకాకుళానికి చెందిన చోడ వరపు వెంకటలక్ష్మి (మౌనానికిదా సమయం) ద్వితీ య, ఎస్.కోటకు చెందిన నాగమంజరి (ఆయుష్మతి–గుమ్మా)లు రచించిన కవితా సంపుటాలు ఎంపికైనట్లు తెలిపారు. వీరికి ఈనెల 19న జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించే సభలో నగదు బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు.

స్నానానికి నదిలో దిగి బాలుడి మృత్యువాత



పూర్ణచంద్రరెడ్డి మృతదేహం

శ్రీకాకుళం క్రైమ్ : స్నానానికని స్నేహితులతో కలిసి నాగావళి నదిలో దిగిన 14 ఏళ్ల బాలుడు మృత్యువాత పడిన ఘటన బుధవారం శ్రీకాకుళం పట్టణంలో చోటుచేసుకుంది. రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ కె.లక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం.. తుమ్మవీధికి చెందిన నెక్కళ్ల యోగి, రాజారత్నం దంపతులకు ఇద్దరు కుమారులు షణ్ముఖసాయి, పూర్ణచంద్రరెడ్డి (14) ఉన్నారు. గురువారం మధ్యాహ్నం మిత్రులతో కలిసి కృష్ణాపార్కు నాగావళి నదికి స్నానానికి వెళ్లారు. నదిలో దిగిన వెంటనే పూర్ణచంద్ర మునిగిపోతుండటంతో అన్న షణ్ముఖసాయి కేకలు వేశాడు. స్థానికులు చేరి బయటకు తీశారు. వెంటనే రిమ్స్ ప్రభుత్వాసుపత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. బాలుడు మృతిచెందాడని వైద్యులు నిర్ధారించి పోలీసులకు సమాచారం అందించారు. రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. కళ్ల ముందే తమ్ముడు నదిలో మునిగిపోవడం చూసి షణ్ముఖసాయి షాక్‌నుంచి తేరుకోలేకపోతున్నాడు.

సిక్కోలు మహిళలకు జాతీయ స్థాయిలో గుర్తింపు



సవర తులసి, దేవాది సుజాతలను అభినందిస్తున్న సజ్జల రామకృష్ణారెడ్డి

శ్రీకాకుళం అర్బన్/హిరమండలం: జాతీయ స్థాయిలో సిక్కోలు గిరిజన మహిళలకు గుర్తింపు రావడం ఆనందదాయకమని కోవె ఉత్తరాంధ్ర కార్యదర్శి గీతా శ్రీకాంత్ అన్నారు. గురువారం విజయవాడలోని పున్నమి ఏపీటీడీసీ అతిథి గృహంలో జరిగిన కోవే జాతీయ స్థాయి సమావేశంలో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ఏజెన్సీ ప్రాంతానికి చెందిన స్వర్ణముఖి, వంశధార ఫార్మర్స్ ప్రొడ్యుసర్స్ ఆర్గనైజేషన్‌కు నాయకత్వం వహిస్తున్న సవర తులసి, దేవాది సుజాతలకు జాతీయ స్థాయిగుర్తింపు లభించింది. దేశవ్యాప్తంగా రెండు వందలకు పైగా మహిళా పారిశ్రామికవేత్తలు తమ ప్రగతిని ఎంట్రీల రూపంలో పంపగా అందులో కేవలం 12 ఎంట్రీలను ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాకు చెందిన స్వర్ణముఖి ఫార్మర్స్ ప్రొడ్యుసర్స్ ఆర్గనైజేషన్ తరఫున సవర తులసి, వంశధార ఫార్మర్స్ ప్రొడ్యుసర్స్ ఆర్గనైజేషన్ తరఫున దేవాది సుజాతలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ఏపీఐఐసీ ఎండీ శ్రీజన గుమ్మళ్ల ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కోవే జాతీయ చైర్‌పర్సన్ మధు త్యాగి, అవార్డ్స్ చైర్‌పర్సన్ ప్రొద్దుటూరి సౌదామిని, ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ చైర్మన్ శ్రీధర్ రెడ్డి, ఏపీ టూరిజం చైర్మన్ ప్రసాద్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ శాఖ కోవే అధ్యక్షురాలు రాధిక, సెక్రటరీ విజయలక్ష్మి, నేషనల్ సెక్రటరీ అపర్ణ, లలిత తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

సీతంపేట: సీతంపేటలోని తురాయిపువలస వీధికి చెందిన గిరిజనుడు సవర రామారావు(37) గురువారం పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు ఎస్సై నీలకంఠరావు అందించిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. భార్యాభర్తల మధ్య చిన్న తగాదా రావడంతో ఆమెపై కోపంతో ఇంట్లో ఉన్న పురుగు మందు తాగేసి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే స్థానిక ఏరియా ఆస్పత్రికి తీసుకురాగా వైద్యులు ప్రథమ చికిత్స అందచేస్తుండగా మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసున మోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించామని చెప్పారు.

అన్నదాన సత్రానికి వాహనం వితరణ




అన్నదాన సత్రానికి స్వామినాయుడు అందజేసిన మారుతి ఇకో వాహనం

వీరఘట్టం: మండలంలోని చిట్టపులివలస జంక్షన్‌లో ఉన్న సత్యసాయిబాబా నిత్యాన్నదాన సత్రానికి శ్రీకాకుళం గురుజాడ విద్యాసంస్థల అధినేత గుంట్రెడ్డి స్వామినాయుడు గురువారం వాహనాన్ని (మారుతి ఇకో) వితరణగా అందజేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ సత్రం నుంచి ప్రతిరోజూ 200 మంది నిరుపేదలకు వాహనం ద్వారా వారి ఇళ్లకు వెళ్లి భోజనం క్యారేజీలను అందజేస్తున్నారు. గతంలో ఉన్న వాహనం మరమ్మతుల బారిన పడిన విషయాన్ని సత్యసాయి భక్తులు స్వామినాయుడికి తెలియజేయడంతో వెంటనే ఆయన స్పందించి రూ.8 లక్షల విలువ గల మారుతి ఇకో వాహనం కొనుగోలు చేసి అన్నదాన సత్రానికి అందజేశారు. ఇప్పటికే గతంలో ఇక్కడ నిర్మించిన అన్నదాన సత్రానికి రూ. 2 కోట్ల విలువైన 40 సెంట్ల భూమిని ఉదారంగా ఇచ్చిన స్వామినాయుడు మరోసారి తన దాతృత్వం చాటుకున్నారని సత్యసాయి భక్తులు సంతోషం వెలిబుచ్చారు.

ఆస్తి పన్ను మొండి బకాయిలపై వడ్డీమాఫీ

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ), ఇచ్ఛాపురం: ప్రభుత్వ, ప్రైవేటు భవనాల ఖాళీ స్థలాలు, ఇంటి పన్నుల బకాయిలపై వడ్డీ మాఫీ చేస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ అవకాశాన్ని మొండి బకాయిదారులు వినియోగించుకోవాలని అధికారులు కోరుతున్నారు. కొన్నేళ్లుగా ఇంటి పన్ను, ఖాళీ స్థలం పన్నులు చెల్లించకుండా ఉన్న వారు ఈ నెల 31వ తేదీలోగా చెల్లించుకుంటే వడ్డీ మాఫీ చేసేందుకు కమిషనర్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ వడ్డేశ్వరం తెలిపారు. ఇప్పటికే పాత బకాయిలు చెల్లించి ఉంటే.. వారందరికి వచ్చే ఏడాదిలో చెల్లించాల్సిన పన్నులో సర్దుబాటు చేసి మిగిలిన మొత్తానికి మాత్రమే పన్ను రశీదుని ఇస్తారని కమిషనర్ తెలిపారు. మొత్తంలో ప్రతి ఏటా మార్చి 31లోగా పన్నులు చెల్లించేందుకు ఏదో ఒక రూపంలో అవకాశాల్ని కల్పిస్తూనే ఉన్నారు. 2019-2021 వరకు కరోనా కష్టకాలంలో ఎంతోమంది పనుల్లేక ఉపాధి కోల్పోవడంతో పన్నులు చెల్లించలేకపోయారని, అలాంటి వారికి ఈ అవకాశం ఎంతో ఉపయోగకరమని తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు పన్నుల లక్ష్యం రూ 53.93కోట్లకు గాను ఇప్పటిరకు రూ 27.53కోట్లు చెల్లించి 51 శాతం లక్ష్యం చేరుకున్నట్లు మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. శ్రీకాకుళంలో 51.40 శాతం, పలాసలో 57.10 శాతం, ఆమదాలవలసలో 43.50 శాతం, ఇచ్ఛాపురంలో 48.90 శాతం పన్నులు వసూలయ్యాయని పేర్కొన్నారు.

సీనియర్ ఇంటర్ పరీక్షలు ప్రారంభం



శ్రీకాకుళంలో పరీక్షలు రాస్తున్న ఇంటర్ సెకెండియర్ విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో సీనియర్ ఇంటర్ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. విద్యార్థులు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు.. సెకెండియర్ విద్యార్థులు సెట్-1 ప్రశ్న పత్రంతో తెలుగు, సంస్కృతం, హిందీ, ఒరియా పేపర్లకు పరీక్ష రాశారు. జిల్లా వ్యాప్తంగా 109 పరీక్ష కేంద్రాల్లో జరుగుతున్న పరీక్షలకు రెండోరోజు మొత్తం 26,118 మంది పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా (97.22 శాతం హాజరు) 25,391 మంది పరీక్ష రాశారు. వివిధ కారణాలతో 727 మంది గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 24,241 మందికి 664 మంది, ఒకేషనల్ విభాగంలో 1877 మందికి 63 మంది విద్యార్థులు డుమ్మా కొట్టారు. డీవీఈఓ కోట ప్రకాశరావు సారవకోట, జలుమూరు, సరుబుజ్జిలి తదితర కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. హెచ్‌పీసీ, డీఈసీ, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్‌లు జిల్లాలో 65కిపైగా కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు.

నలుగురు దొంగల అరెస్ట్

- దొంగిలించిన సామగ్రి రికవరీ
- రిమాండ్‌కు నిందితుల తరలింపు

చీపురుపల్లిరూరల్(గరివిడి): ఎవరూ లేని సమయంలో ఇంట్లో చొరబడి వస్తువులను దోచుకుపోయిన కేసులో గరివిడి ఎస్సై బి.మురళి ఆధ్వర్యంలో పోలీసులు గురువారం దొంగలను పట్టుకుని దొంగతనం చేసిన వస్తువులను రికవరీ చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఈ దొంగతనం కేసుకు సంబంధించిన ఎస్సై తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గరివిడి పట్టణంలోని కొండపాలెం హడ్కోకాలనీకి చెందిన తమ్మిన విజయలక్ష్మి విశాఖపట్నంలోని ఆరిలోవలో నివాసం ఉంటున్నారు. గరివడిలోని ఆమె ఇంట్లో ఈ నెల 8న గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి దొంగతనం చేశారు. ఈ విషయమై తనకు తెలిసిన వ్యక్తులు స్థానికులైన పద్మ, మణికుమార్‌లతో కలిసి గరివిడి పోలీస్‌స్టేషన్ వచ్చిన ఆమె ఈనెల 10న దొంగతనం జరిగినట్లు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా ఫింగర్‌ప్రింట్స్ సేకరించగా షేక్ కరీం అనే వ్యక్తి నిందితుడిగా తెలిసింది. ఈ నెల 15న కొండపాలెం జంక్షన్ వద్ద షేక్‌కరీంతో పాటు అతని స్నేహితులైన మరో ఇద్దరిని అరెస్టు చేసి విచారణ చేయగా విజయలక్ష్మి ఇంటిలో జమ్ము ధనుంజయ, బత్తుల రాజు సహకారంతో దొంగతనం చేసినట్లు అంగీకరించారు. దొంగిలించిన సామగ్రిని స్క్రాప్ దుకాణం నడుపుతున్న సందక రత్నకుమారికి విక్రయించినట్లు తెలిపారు. ఈమేరకు టీవీ, గ్రైండర్, మిక్సీ, డైనింగ్ టేబుల్‌ను వారి నుంచి రికవరీ చేసి ఆ నలుగురు నిందితులను రిమాండ్కు తరలించినట్లు ఎస్సై చెప్పారు.



చిపురుపల్లి రూరల్: పోలీసులకు పట్టుబడిన నిందితులు, రికవరీ చేసిన సామగ్రి

నిందితుడి అరెస్ట్

విజయనగరం క్రైమ్: ఓఎల్ఎక్స్‌లో కొనుగోలు చేసిన సెల్‌ఫోన్‌కు ఫోన్‌పే ద్వారా డబ్బులు పంపించానని ఫేక్ మెసేజ్ చూపించి పరారైన నిందితుడ్ని వన్‌టౌన్ పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. గుంకలాం గ్రామానికి చెందిన లెంక కృష్ణ తన వద్దనున్న రూ.లక్షా 15వేల విలువైన ఫోన్‌ను ఓఎల్ఎక్స్‌లో అమ్మకానికి పెట్టాడు. అది చూసి విశాఖ నుంచి వచ్చిన వ్యక్తి కొనుగోలు చేసేందుకు ఆర్టీసీ కాంప్లెక్స్ వద్దకు బుధవారం రమ్మన్నాడు. అక్కడ వస్తువు చూసి తీసుకుని ఫోన్‌పే ద్వారా డబ్బులు వేసినట్లు నటించి, ఫేక్ మెసెజ్ చూపించి పరారయ్యాడు. ఈ ఘటనలో మోసపోయినట్లు గుర్తించిన కృష్ణ వెంటనే వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన వన్‌టౌన్ పోలీసులు 24 గంటల్లోపే కేసును ఛేదించారు. ఈ కేసు ఛేదించడంలో కీలకపాత్ర పోషించిన వన్‌టౌన్ ఎస్సై వి.అశోక్ కుమార్, సిబ్బందిని సీఐ అభినందించారు.



విజయనగరం టౌన్: వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు (వెనుక ముసుగులో నిందితుడు)

జాతీయ బాలభవన్ పోటీల్లో రాజాం విద్యార్థులు

రాజాం: బీహార్ రాష్ట్ర రాజధాని పాట్నాలోని కలికరి స్టేట్ బాలభవన్‌లో ఈనెల 11 నుంచి 15 వరకూ 28వ నేషనల్ యంగ్ ఎన్విరాన్‌మెంటలిస్ట్ కాన్ఫరెన్స్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో రాజాం వరలక్ష్మి సెయింట్‌ఆన్స్ పాఠశాల 8వ తరగతి విద్యార్థులు జె.ప్రసిద్ధ, టి.మోహనరావులు పాల్గొని, ప్రథమ బహుమతిని కైవసం చేసుకున్నారు. ఎగ్జిబిషన్‌లో ప్రథమ బహుమతితో పాటు మోహనరావు పెయింటింగ్, నాటిక ప్రదర్శనల్లో కూడా వరుసగా ద్వితీయ, కన్సొలేషన్ బహుమతులు సాధించాడు. ఆ విద్యార్థులకు నేషనల్ ఎడ్యుకేషన్ సెక్రటరీ దీపక్‌సింగ్ చేతుల మీదుగా స్టేట్ బాలభవన్ డైరెక్టర్‌లు బహుమతులు అందజేశారు. మొత్తం 16 రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ప్రథమ స్థానంలో నిలిచిన ప్రసిద్ధ, మోహనరావులను రాజాంలో వరలక్ష్మి సెయింట్‌ఆన్స్ స్కూల్‌లో గురువారం ప్రిన్సిపాల్ సిస్టర్స్ లూథ్‌మేరీ, కరస్పాండెంట్, సిస్టర్ సెసిలీన్, బాలభవన్ డైరెక్టర్ సుంకరి రమేష్ తదితరులు గురువారం పాఠశాలలో అభినందించారు.



రాజాం: విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

14టన్నుల పీడీఎస్ బియ్యం పట్టివేత



విజిలెన్స్ అధికారులు పట్టుకున్న పీడీఎస్ బియ్యంతో లారీ

బొండపల్లి: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో గురువారం ఉదయం జాతీయ రహదారి 26 మీదుగా లారీలో పీడీఎస్ బియ్యం అక్రమంగా తరలిస్తుండగా విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రం పార్వతీపురం పట్టణం నుంచి కాకినాడలోని పోర్టుకు లారీలో అక్రమంగా 280 బస్తాల (14 టన్నులు) పీడీఎస్ బియ్యం తరలిస్తుండగా శ్రీకాకుళం విజిలెన్స్ సీఐ బి.సింహాచలానికి అందిన సమాచారం మేరకు లారీని పట్టుకుని బొండపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బియ్యం విలువ సుమారు రూ.5 లక్షలు ఉంటుందని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని 6ఎ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం బియ్యంతో పాటు లారీని స్వాధీనం చేసుకుని గజపతినగరంలోని ఎంఎల్‌సీ పాయింట్‌కు తరలించి అధికారులకు అప్పగించినట్లు చెప్పారు. కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి జి.పురుషోత్తం, ఏఎస్‌ఓ బి.అశోక్, గజపతినగరం సివిల్ సప్లయిస్ డీటీ రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

'యాదవులంతా రుణపడి ఉంటాం'

టెక్కలి: యాదవ సామాజిక వర్గానికి చెందిన నర్తు రామారావును అత్యధిక మెజారిటీతో గెలిపించి ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి యాదవులంతా రుణపడి ఉంటారని అఖిల భారతీయ యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు జి.గురునాథ్‌యాదవ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

నర్తు రామారావును ఎమ్మెల్సీగా గెలిపించడానికి కృషి చేసిన ప్రజాప్రతినిధులందరికీ ఈ సందర్భంగా ఆయన ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో రాజకీయంగా యాదవులకు సముచిత స్థానం కల్పించిన సీఎం జగన్ వెంట యాదవులంతా నడవాలని ఆయన కోరారు.

రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలు



చికిత్సపొందుతున్న సంతోష్‌కుమార్



చికిత్స పొందుతున్న యుగంధరరావు

పార్వతీపురం: కొమరాడ మండలం మాదలింగి గ్రామానికి చెందిన ఆర్. సంతోష్‌కుమార్, స్నేహితుడు డి.మోహన్ ద్విచక్రవాహనంపై వెళ్తుండగా వెనుకనుంచి వచ్చిన మరో ద్విచక్రవాహనం ఢీకొనడంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. బుధవారం సాయంత్రం సంతోష్, మోహన్‌లు మాదలింగి నుంచి చినమేరంగికి ద్విచక్రవాహనంపై వెళ్లారు. పాతతొడుము గ్రామం దాటిన తరువాత వెనుకనుంచి వస్తున్న మరో ద్విచక్రవాహనం వీరి బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో మోహన్, సంతోష్‌లకు పలుచోట్ల తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108 వాహనం క్షతగాత్రులను పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు.

కొమ్మ మీద పడి మరొకరికి..

జియ్యమ్మవలస మండలం కన్నపుదొరవలస గ్రామానికి చెందిన టి.యుగంధరరావు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా చెట్టుకొమ్మతలపై పడడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. వివరాలిలా ఉన్నాయి. గురువారం ఉదయం కన్నపుదొరవలస నుంచి కార్పెంటర్ పని నిమిత్తం యుగంధర రావు, అసిస్టెంట్ కార్తీక్ ద్విచక్రవాహనంపై గుమ్మలక్ష్మీపురం వెళ్తుండగా పి.ఆమిటి జంక్షన్ సమీపంలో ఎండిపోయిన తుమ్మచెట్టు కొమ్మ యుగంధరరావు తలపై పడింది. దీంతో బలమైన గాయమైంది. కార్తీక్ వెంటనే 108కు ఫోన్‌చేసి పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి చికిత్సకోసం తరలించాడు.

బస్సు ఢీకొని వ్యక్తికి..

రాజాం సిటీ: స్థానిక బస్టాండ్ ఇన్‌గేట్ వద్ద గురువారం బస్సు ఢీకొని తెర్లాం మండలం పెదపాలవలస గ్రామానికి చెందిన చెల్లూరి విశ్వనాథం గాయాల పాలయ్యాడని ఎస్సై పి.సూర్యకుమారి తెలిపారు. జి.సిగడాంలో నివాసం ఉంటున్న కుమారుడు గౌరీశంకర్ ఇంటికి వెళ్లేందుకు విశ్వనాథం రాజాం వచ్చాడు. బస్టాండ్‌లో తన కోసం ఎదురుచూస్తున్న కుమారుడితో కలిసి నడుచుకుంటూ ఇన్‌గేటు వైపు వచ్చాడు. అదే సమయంలో కాంప్లెక్స్‌లోకి వస్తున్న బస్సు ఢీకొనడంతో రోడ్డుపై పడిపోయాడు. వెంటనే గమనించిన కుమారుడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందాడు. ఈ ఘటనపై ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

చిరుధాన్యాల సాగు పెంపు

- ఈ ఖరీఫ్‌లో 20 వేల ఎకరాల్లో చేపట్టేందుకు యోచన
- మూడు రెవెన్యూ డివిజనల్లో ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు

విజయనగరం ఫోర్ట్:

ఆరోగ్య సిరిగా పేరుగాంచిన చిరుధాన్యాల సాగును పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు ఈ ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లలో అధిక విస్తీర్ణంలో సాగు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. చిరుధాన్యాలు సాగు చేసే రైతులకు రాయితీపై విత్తనాలు ఇవ్వడంతో పాటు సాగుపై శిక్షణ కూడా ఇవ్వనున్నారు. చిరుధాన్యాలకు ఇటీవల డిమాండ్ పెరిగింది. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులు ఎక్కువగా చిరుధాన్యాలను తినడానికి ఇష్టపడుతున్నారు. రైతులు సాగుచేసిన చిరుధాన్యాలను కొనుగోలు చేసే విధంగా కూడా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

జిల్లాలో మూడు ప్రాసెసింగ్ యూనిట్లు

చిరుధాన్యాలు సాగు చేసినప్పటికీ కొనుగోలు తక్కువగా ఉండడంతో రైతులు సాగు చేయడానికి అంతగా ఆసక్తి చూపడం లేదు. అదేవిధంగా చిరుధాన్య ఉత్పత్తులను ఉప ఉత్పత్తులుగా తయారు చేయడానికి అవసరమైన ప్రాసెసింగ్ యూనిట్లు కూడా లేకపోవడం వల్ల కూడా చిరుధాన్యాల సాగు తక్కువగా అయ్యేది. దీన్ని గమనించిన ప్రభుత్వం జిల్లాలో విజయనగరం, చీపురుపల్లి, బొబ్బిలి రెవిన్యూ డివిజన్‌లలో ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు నెలకొల్పడం ద్వారా చిరుధాన్యాల సాగు పెంచవచ్చని భావిస్తోంది.



గంట్యాడ మండలంలో సాగులో ఉన్న చోడి పంట

గత సీజన్‌లో 3,090 ఎకరాల్లో సాగు

2022 ఖరీఫ్ సీజన్‌లో చిరుధాన్యాలు 3,090 ఎకరాల్లో సాగైంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 20 వేల ఎకరాల్లో చిరుధాన్యాల్లో ప్రధానమైన చోడి పంటను సాగు చేసేలా ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తోంది. బోరు బావుల వద్ద, తేలిక పాటి నేలలు, వర్షాధార భూముల్లో వరికి ప్రత్యామ్నాయంగా చోడి పంటను సాగు చేసేలా చర్యలు చేపడుతున్నారు. చిరుధాన్యాలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం రాయితీపై నాణ్యమైన విత్తనాలు అందించనుంది. అదేవిధంగా జిల్లా కేంద్రంలో ఉన్న వ్యవసాయ పరిశోధన స్థానంలో చోడి పంటపై పరిశోధనలు చేసి అధిక దిగుబడిని ఇచ్చే వంగడాలను అందించనున్నారు.

రాయితీపై విత్తనాలు



చిరుధాన్యాల సాగును పెంచేందుకు చర్యలు చేపడుతున్నాం. 2023 ఖరీఫ్, సీజన్‌లో 20 వేల ఎకరాల్లో చోడి సాగు చేసేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం. చిరుధాన్యాలు సాగు చేసే రైతులకు రాయితీపై విత్తనాలు, అవసరమైన సూచనలు, సలహాలు అందించనున్నాం.

– వి.తారకరామారావు, జిల్లా వ్యవసాయ అధికారి

మూడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌ల్లో కొత్త మండలాలు


- ఐసీడీఎస్ పీడీ వి.శాంతకుమారి



తెర్లాం-5 అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీస్కూల్ కిట్లను పరిశీలిస్తున్న ఐసీడీఎస్ పీడీ శాంతకుమారి

తెర్లాం: జిల్లాలోని మూడు ఐసీడీఎస్ ప్రాజెక్టలలో కొత్తగా మూడు మండలాలను విలీనం చేసినట్లు ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శాంతకుమారి తెలిపారు. మండలంలోని పణుకువలస, తెర్లాం-5 అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని బాడంగి ఐసీడీఎస్ ప్రాజెక్టలో రామభద్రపురం మండలాన్ని, రాజాం ఐసీడీఎస్ ప్రాజెక్టలో వంగర మండలాన్ని, బొబ్బిలి అర్బన్‌ను బొబ్బిలి రూరల్ ప్రాజెక్ట్‌లో విలీనం చేశామని తెలిపారు. గతంలో రామభద్రపురం మండలం సాలూరు ప్రాజెక్టలోను, బొబ్బిలి అర్బన్ అదే ప్రాజెక్టలోను, వంగర వీరఘట్టం ప్రాజెక్టలో ఉండేవని చెప్పారు. కొత్తగా ఒక్కో ప్రాజెక్టలో మూడు మండలాలను చేర్పించేందుకు చర్యలు తీసుకున్నామని, అందులో భాగంగానే మూడు ప్రాజెక్టలలో కొత్తగా ఒక్కో మండలాన్ని చేర్చినట్లు తెలియజేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై ఫిర్యాదు వస్తే చర్యలు తీసుకునేందుకు వెనుకాడేదిలేదని హెచ్చరించారు. తెర్లాం మండలం పణుకువలస అంగన్‌వాడీ కేంద్రంపై ఫిర్యాదు రావడంపై దర్యాప్తు నిర్వహించామని తెలిపారు. ఈ కేంద్రాన్ని తనిఖీ చేయగా ప్రీస్కూల్ నిర్వహణ, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ సక్రమంగానే జరుగుతుందని, స్టాక్ నిల్వల్లో కొద్దిగా తేడాలు ఉండడంతో వాటిని మిగులు నిల్వలో చూపించామన్నారు. ఆమెతోపాటు బాడంగి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ కె.రాజ్యలక్ష్మి, తెర్లాం సెక్టార్ సూపర్‌వైజర్ ఉషారాణి, తెర్లాం-5 అంగన్‌వాడీ కార్యకర్త వై.శ్రీదేవి తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీగా గెలిచిన అనంతరం సర్టిఫికెట్‌ను తీసుకుంటున్న నర్తు రామారావు



నర్తుకే స్థానిక బెర్త్



- స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో నర్తు రామారావు గెలుపు
- కనీస పోటీ ఇవ్వలేకపోయిన ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన టీడీపీ నాయకుడు
- చంద్రబాబు జోక్యం చేసుకున్నా ఫలితమివ్వని పరిస్థితి
- 524 ఓట్ల మెజార్టీతో గెలిచిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థి

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: ఎన్నికలు మారాయి. ఫలితం మారలేదు. అభ్యర్థులే మారారు.. పార్టీ ఆధిక్యత మారలేదు. సార్వత్రిక ఎన్నికల్లో మొదలైన వైఎస్సార్ సీపీ విజయ విహారం.. తర్వాత జరిగిన అన్ని ఎన్నికల్లోనూ కొనసాగింది. ఇప్పుడు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ ఆ పార్టీనే విజయ పతాకం ఎగురవేసింది. జిల్లాలో టీడీపీ కుట్రలు ఫలించలేదు. ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన ఆనెపు రామకృష్ణకు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఫోన్ చేసి మద్దతు పలికినా లాభం లేదు. ఎవరెన్ని కుతంత్రాలు చేసినా స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి నర్తు రామారావు గెలుపును ఆపలేకపోయారు. 524 ఓట్ల మెజార్టీతో నర్తు విజయకేతనం ఎగరవేశారు. కౌంటింగ్ ప్రారంభించిన కొన్ని గంటల్లోనే ఫలితం వచ్చేసింది. ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన టీడీపీ నాయకుడికి ఓటమి తప్పలేదు.

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తిరుగులేని విజయం సాధించింది. పోలైన 752 ఓట్లలో 632 ఓట్లు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి నర్తు రామారావుకు పడగా, ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన టీడీపీ నాయకుడు రామకృష్ణకు 108 ఓట్లు మాత్రమే దక్కాయి. అద్భుతం చేస్తామని టీడీపీ నాయకులు చెప్పినా వారి ఆశలు ఫలించలేదు. ఎవరి ఓట్లపైనా ఆశపడకుండా తమ ఓట్లుతోనే వైఎస్సార్‌సీపీ విజయం సాధించింది. సామాజిక కోణంలో చిచ్చు రేపి లబ్ధిపొందాలని ఆశించిన టీడీపీ నాయకుడికి చేదు అనుభవం ఎదురైంది. ఆత్మప్రబోధం మేరకు ఓటు వేయాలని ఇండిపెండెంట్ అభ్యర్థి కోరినట్టుగానే వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులంతా తమ పార్టీ అభ్యర్థికి ఓటేసి అఖండ విజయం చేకూర్చారు. టీడీపీ నాయకుల ప్రలోభాలు, కుట్రలు, సామాజిక వర్గం కోణంలో వైఎస్సార్ సీపీ ఓట్లు కొల్లగొట్టేందుకు చేసిన యత్నాలు ఫలించలేదు.

కౌంటింగ్ ఆసక్తికరం..

మొత్తం పోలైన 752 ఓట్లు లెక్కించగా 12ఓట్లు ఇన్‌వాలిడ్ అయ్యాయి. ఒకటి అంకె రాయడానికి బదులు టిక్ పెట్టడంతో ఆ ఓట్లు చెల్లలేదు. ఇవన్నీ వైఎస్సార్‌సీపీకి చెందిన సభ్యులవే కావడం విశేషం. దీంతో వైఎస్సార్‌సీపీకి 632 ఓట్లు మాత్రమే కౌంట్ అయ్యాయి. ఇండిపెండెంట్ అభ్యర్థికి 108ఓట్లునమోదయ్యాయి. దీంతో 524 ఓట్ల ఆధిక్యతతో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి నర్తు రామారావు విజయం ఖాయం చేసుకున్నారు.

ఎట్టకేలకు నర్తు కల సాకారం..

చట్టసభల్లో ప్రాతినిధ్యం వహించాలని నర్తు రామారావు ఎన్నో ఏళ్లుగా ప్రయత్నిస్తున్నారు. కానీ నెరవేరలేదు. గతంలో రెండు సార్లు అసెంబ్లీకి పోటీ చేసినా విజయం వరించలేదు. 2009 ఎన్నికల్లో ఇచ్ఛాపురం నుంచి కాంగ్రెస్ తరఫున, 2014లో వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేసి ఓటమి పాలయ్యారు. దీంతో చట్ట సభలకు వెళ్లాలన్న కోరిక కలగానే మిగిలిపోయింది. 2019 ఎన్నికల సమయంలో ఈసారి ఎమ్మెల్సీ చేస్తానని వైఎస్ జగన్ హామీ ఇవ్వడంతో ఆయనకు ఆశలు చిగురించాయి. మాట ఇస్తే మడమ తప్పరు అని నిరూపించుకున్న వైఎస్ జగన్ నిర్ణయంతో చట్టసభలకు వెళ్లాలన్న కోరిక సాకారమైంది.

తొలి యాదవ నేత

జిల్లాలో యాదవ సామాజిక వర్గానికి చెందిన నేత తొలిసారి చట్టసభలో అడుగు పెడుతున్నారు. జిల్లా చరిత్రలో ఇంతవరకు ఏ ఒక్క యాదవ నేత చట్టసభలకు వెళ్లలేదు. నర్తు రామారావుకు ఇప్పుడు ఆ అవకాశం వచ్చింది. స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా పోటీ చేయడమే కాకుండా అత్యధిక మెజార్టీతో గెలిచిన నాయకుడిగా నర్తు రామారావు చరిత్రలో నిలిచి పోయారు. ఇప్పటివరకు ఇంత మెజార్టీ వచ్చిన సందర్భం లేదు.



సీఎంకు జీవితాంతం రుణపడి ఉంటా

– స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నర్తు రామారావు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): స్వాతంత్ర్యం అనంతరం యాదవులకు రాజకీయాల్లో అవకాశం ఇచ్చి ఎమ్మెల్సీ చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. తమకు ఇంత గుర్తింపు ఇచ్చిన సీఎంకు జీవితాంతం రుణపడి ఉంటానని ఆయన అన్నారు. ఎమ్మెల్సీ ఫలితాలు వెల్లడించాక ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ అభిమానులు, యాదవుల సమక్షంలో భారీగా బాణసంచా కాల్చి సంబరాలను జరుపుకున్నారు. ఇచ్ఛాపురం నుంచి శ్రీకాకుళం వరకు కార్లతో ర్యాలీగా కౌంటింగ్ సెంటర్ వద్దకు చేరుకుని వైఎస్సార్‌సీపీ శ్రేణులు విజయోత్సవాన్ని జరుపుకొన్నారు. అనంతరం నర్తు మాట్లాడారు. టీడీపీ యాదవుల్ని ఓట్లు, సీట్లు కోసం వాడుకుందే తప్ప ఏనాడూ ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. జిల్లాలో ఉన్న జెడ్పీటీసీలు, ఎంపీటీసీలంతా సహకరించి నా మీదున్న అభిమానాన్ని చూపించినందుకు రుణపడి ఉంటానన్నారు. అంతేకాకుండా తన గెలుపునకు కృషి చేసిన రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రి సీదిరి అప్పలరాజు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపారు. విజయోత్సవాల్లో పిరియా సాయిరాజ్, నర్తు నరేంద్రయాదవ్, పిన్నింటి సాయి, ఇప్పిలి కృష్ణారావు, తడక జోగారావు, పిలక రాజ్యలక్ష్మి, సంతోష్, ఆది రెడ్డి, రజనీకుమార్ దొలాయ్, కడియాల ప్రకాష్, బద్రి ప్రకాష్, గద్దిబోయిన కృష్ణాయాదవ్, మామిడి సంతోష్ పాల్గొన్నారు.